
# ఒకరి మనసు ఒకరికి...



'సృజనప్రియ' పత్రిక 'ఏడవ వార్షిక ప్రత్యేక సంచిక'

చలిరాజు హేమంతుడు ఎముకల్ని కొరికేస్తూ తన ఉనికిని చాటుకుంటూనే ఉన్నాడు.

దాడి చేస్తున్న శీతలనాథునికి తిక్కరేగిందో, ఏమో... చలిగాలులతో చుట్టుముట్టి పరతమ బేధాలు లేకుండా అందరి ప్రాణాలు తోడేస్తున్నాడు.

అప్పుడే ఉదయిద్దామనుకున్న భానుమూర్తి మబ్బుల ముసుగునుండి బయటకు రావడానికి భారంగా అడుగులు వేస్తున్నాడు. మంచు పవనాలు పొగలా మారి, తనను ఆక్రమించడంతో తేరుకోలేక తూర్పుతీరంలోనే కృంగిపోయి ఉన్నాడు.

అసలే ఏ.సి. ఛైర్‌కార్‌లో కూర్చున్న నిఖిల్ మనసు ఆ చల్లదనానికి ఆనందంతో పరవశిస్తోంది. చేతివాచీ వంక చూసుకున్నాడు. ఉదయాన్నే విజయవాడలో బయలుదేరిన 'పినాకిని ఎక్స్‌ప్రెస్' అరగంటైనా కాలేదు- అప్పుడే 'తెనాలి' వచ్చేసింది. లోపలి ఎయిర్ కండీషన్ కూలింగ్, బయట వింటర్ చల్లదనం కలిసి విండో అద్దాల మీద మంచుపొగ ముత్యాల లాగా పొదగబడి ఉన్నాయి. వాటిని కర్టెన్‌తో సుతారంగా తుడిచి బయటకు తొంగిచూశాడు.

'తెనాలి జంక్షన్' బోర్డును దాటుకొని వెళ్లి రైలు నెమ్మదిగా స్లో అవసాగింది!

బయట ప్లాట్‌ఫామ్ మీద జనం కోలాహలంగా అటూఇటూ బోగీలను వెదుక్కుంటూ పరుగులు తీయడం కనిపిస్తోంది. తను ఉన్నది ఏ.సి. ఛైర్‌కార్ కావడంతో పెద్దగా దానివైపు ఎవరూ చూడడం లేదు.

తను కూర్చున్న సీటు నంబర్ ఒకటి నుండి వెనక్కి చూశాడు. చాలా సీట్లు ఖాళీగా కనబడుతున్నాయి. చలికాలంలో పెద్దగా ఏ.సి.ని ప్రిఫర్ చేయలేకపోవడంవల్లనేమో- అక్కడక్కడ ఓ పదిమంది వరకు మాత్రమే కనబడుతున్నారు.

చటుక్కున డోర్ తీసుకొని లోపలికి చొరబడ్డ అమ్మాయి వైపు అతని దృష్టి మరలింది.

తలుపు తోసుకురావడంతో ఒకింత వేడితనాన్ని సంతరించుకున్న చలిగాలి ఒంటిని తాకి పులకించినట్లయింది. ఆ అనుభూతి- స్పృశించి స్పందింపజేసిన చిరుగాలి వల్లనో, లేక చిరు నోయగాలలో బోగీలోకి అడుగుపెట్టిన అతివ వల్లనో అర్థంకాలేదు మొదట్లో నిఖిల్‌కి.

భుజాన ట్రావెలర్స్ బ్యాగ్, చేతిలో సూట్‌కేసుతో సీటును వెదుక్కునేందుకు ఆపసోపాలు పడుతోందామె. ఆతృతతో అడుగుపెట్టిన ఆమె ముఖానికి పట్టిన చిరుచెమటలు ఆడతనపు అందాల్ని మరింతగా ద్విగుణీకృతం చేస్తున్నాయి.

గాఢ సుషుప్తి వేళ, మనోమందిరంలో అలవోకగా కదలాడే జ్ఞాపకాల నీలితెరలకు వేళ్లాడే నక్షత్రంలా ధగధగలాడుతూ అఘ్రాణించిన ఒక విచిత్రమైన పరిమళం తాలూకు మధురస్వప్నంలా ఉంది. ప్రాతఃసంధ్యలా ప్రవేశించిన ఆ లావణ్యరాశిని చూడగానే మనసు చిక్కబడినట్లయింది.

"ఎక్సలెంట్..!" తనలో తాను అనుకుందామనుకొని పైకే అనేశాడు.

బ్యాగ్‌ను పైన పెట్టడానికి ఇబ్బందిపడుతున్న ఆమె చటుక్కున ఇటువైపుకు తిరిగింది.

క్షణకాలం తత్తరపాటుకు లోనయ్యాడు.

బరువుగా ఉన్న లగేజీని పైన సర్దడంలో సహాయం చేయాలనిపించింది. మూవ్ అవుతున్న ట్రైన్‌లో తూలడంతో బ్యాగ్ క్రింద పడబోయింది. చటుక్కున పట్టుకొని సరిచేశాడు.

హేండ్‌బ్యాగ్‌లోని కర్చీఫ్‌తో ముఖాన్ని అద్దుకొని టికెట్ వెరిఫై చేసుకుని కూర్చుంది.

తెనాలి వదిలిన రైలు స్పీడ్ అందుకొని ముందుకు సాగిపోతోంది. కర్టెన్ ప్రక్కకు తొలగించి బయటకు తొంగిచూసిన నిఖిల్‌కి చెట్లుచేమలు, టెలిఫోన్ స్తంభాలు వెనక్కి పరుగెత్తడం కనిపిస్తోంది... తన మనసులా.

తాను చాలాసార్లు ఇలా రైలు ప్రయాణం చేశాడు. కానీ, ఈరోజు ఎందుకో చాలా ఉల్లాసంగా ఉంది... ఆహ్లాద భరితమైన వాతావరణం, ఉత్సాహ భరితమైన ప్రయాణం!

ఒక్కసారి అవంతి మాటలు జ్ఞాపకం వచ్చి పెదాలు చిన్నగా విచ్చుకున్నాయి. ఆమె మాటలలోని భవతి గుర్తుకురావడంతో ఏదో పులకింతకు లోనయ్యాడు.

"ఈ రికార్డ్ ఎవరిదే..?"

"నా క్లాస్‌మేట్ భవతిది!"

"హాండ్ రైటింగ్ సూపర్బ్‌గా ఉంది!"

"మనిషి ఇంకా సూపర్బ్‌గా ఉంటుంది."

"రియల్లీ..?"

"య్యస్... మా యూనివర్శిటీ క్యాంపస్ బ్యూటీ అది!"

"అహఁ... అయితే ఆలోచించాల్సిందే!!"

"ఇంకా ఆలోచించడమేమిట్రా... ముందుకు అడుగేయాల్సింది పోయి..!"

"క్యాంపస్ బ్యూటీలకు మనం కనబడతామంటావా?" పేజీలు తిరగేస్తూ అన్నాడు ఛలోక్తిగా.

"కనబడకపోవడానికి నీకేం తక్కువరా! అయిదున్నర అడుగుల అందగాడివి... ఎయిర్‌టెల్‌లో ఇంజనీర్‌వి. పైగా, ఈ అవంతికి అన్నగారివి!"

"అయిదున్నర అడుగుల అందం, అవంతికి అన్న... అన్నీ బాగానే ఉన్నాయి. పని చేసేది ఎయిర్‌టెల్‌లో కదా! ట్రై చేస్తే 'గాలివాళ్ళం' అనుకుంటుందేమో..?!"

"ఏదో జోక్ చేశాను గాని- భవతి చాలా మంచి అమ్మాయి. అందానికి అందం, చదువుకు చదువు... బ్రీఫ్ గా చెప్పాలంటే ఆల్ ఇన్ వన్!" అంది- రికార్డ్‌లో ఫార్ములాస్‌ని క్యాలిక్యురేటర్‌తో సరిచేసుకుంటూ.

"రియల్లీ..? అయితే ఒక్కసారి పరిచయం చేయకూడదూ?!"

"పరిచయం అయితే మమ్మీ, డాడీకి కోడల్ని వెదుక్కునే శ్రమ తప్పుతుందిరా!" అంది వచ్చిన నవ్వును రెట్టింపు చేస్తూ.

"కనీసం ఆ పని చేయవే అమ్మలూ! లేకపోతే ఇరవై ఆరు వచ్చినా ఇంకా చేతులు కాల్చు కుంటానంటాడు వీడు!!" అప్పుడే తయారుచేసిన చపాతీలు తీసుకువస్తూ అంది తల్లి శ్రీలక్ష్మి.

"చేతులు కాల్చుకోవడమెందుకు మమ్మీ? చెన్నైలో ఉడిపి హోటల్స్ కోకొల్లలు అయితేనూ!"

"ఎప్పుడైనా నా కొడుకును చూద్దామని మీ నాన్న, నేను చెన్నై వస్తే... మాకు కూడా సత్రం కూడూ, మఠం నిద్రా అన్నమాట!" కర్రీ వేస్తూ అంది.

"వండిపెట్టడానికి ఈ అవంతీదేశపు రాణిగారు ఉన్నారుగా!" అన్నాడు కవ్వింపు ధోరణిలో చెల్లెలు వైపు చూస్తూ.

"రాణులు రాజ్యాలకు మాత్రమే పరిమితం... మిగతావాటికి అతీతంగా ఉంటారు!"

"నీకు రాజ్యమేమిటే?" కూతుర్ని ఆడిస్తూ అంది శ్రీలక్ష్మి.

"అవును మమ్మీ... నా చదువు, నా యూనివర్సిటీ క్యాంపస్!"

"అందుకేగా- ఏ క్యాంపస్ బ్యూటీ అయినా తారసపడకపోతుందా... అని ఎదురు చూస్తున్నాను!" అర్థోక్తిగా అన్నాడు.

"నువ్వు అలా కలలు కంటూనే ఉండు- ఇరవై ఆరు నెమ్మదిగా తిరగబడి అరవై రెండు అయికూర్చొంటుంది!" అంది అవంతి.

"మొన్న డాడీ 'ఆ సత్తెనపల్లి సంబంధాన్ని చూసొద్దాం రా!' అంటే- 'సత్తెనపల్లీ వద్దు, సత్తుపల్లీ వద్ద'ని మొరాయించాడు. చివరికి ఆ అమ్మాయికి అమెరికా మొగుడు దొరకడంతో విమానం ఎక్కేసిందట!"

"మమ్మీ! నేను క్యాంపస్ ఇంటర్వ్యూలో ఉద్యోగానికి సెలెక్ట్ అయిన వాణ్ణి! అలాగే క్యాంపస్ ఇంటర్వ్యూలు కండక్ట్ చేసి, కోడల్ని సెలెక్ట్ చేసుకొస్తాను... చూడు!"

"అయితే మా భవతి ఏమైపోతుందిరా?"

"భవతో, భారతో... ఎవర్తో ఒకత్తె! దేన్నో దాన్ని తెచ్చి వీడిని పెళ్ళికి ఒప్పించవలసిన బాధ్యత నీదే అమ్మలూ! దానిగురించి మీ డాడీ కూడా బెంగపెట్టుకున్నారు!" అంది ఆవిడ- కొడుక్కి ఒక తోడును తీసుకురావాలన్న ఆతృతతో.

"సరేలే మమ్మీ! ఆ భవతికీ ఏమవదు... ఈ అవంతికీ ఏమీ కాదు. చక్కగా ఎమ్మెస్సీ పూర్తిచేస్తారు."

"చేయక ఛస్తామా? ఫస్టియర్ వైజాగ్ హాస్టల్‌లో జాయిన్ అయిన కొత్తలో ర్యాగింగ్ ఎక్కువగా ఉండేది. కుర్రకారు 'భవతీ... భిక్షాందేహి!' అంటూ దాని వెంటపడి ఏడిపించేవారు."

– చెల్లెలు మాటలు జ్ఞాపకం వచ్చేసరికి నిఖిల్‌కి పుటుక్కున నవ్వు వచ్చింది. భవతి ఆల్ ఇన్ ఒన్ అట! ఆమె అందం కాదు... హృదయం కనబడింది ఆ నిమిషాన. అందం, ఆకర్షణ, చదువు, సంస్కారం, కలుపుగోలుతనం, వ్యక్తిత్వం... అన్నీ తానై అలరారుతుందట! సాధారణంగా ఒక అమ్మాయి గురించి సాటి అమ్మాయి అంత ఉన్నతంగా మాట్లాడటం చాలా అరుదు. అటువంటిది- అవంతి తన క్లాస్‌మేట్ గురించి అంత అపూర్వంగా చెబుతుంటే... తన ఆలోచనలు ఎప్పుడూ ఆమె చుట్టూనే తిరుగుతున్నాయి.

అన్ని అందాల్ని తనివిగా చేసుకున్న భవతిని చూడాలనిపిస్తోంది నిఖిల్‌కి.

"మాచర్ల మాల్యాద్రిగారి సంబంధం చూసిపోరా! పిల్ల నీకు నచ్చితే మిగతావి మనకు పట్టింపు లేదు!" అనే తల్లి ఆతృతకి నవ్వు వచ్చేది.

"ఒరేయ్ఁ... నువ్వు ఎంతమంది నైనా చూడు గాని, అమ్మాయి మటుకు భవతిలా ఉండాలి. అప్పుడే మేము ఒప్పుకునేది!" చెల్లెలి మాటలతో- ఆలోచనలు 'భవతి' అనే అమ్మాయి చుట్టూనే అల్లుకుపోయేవి.

"పోనీ, భవతినే ఖాయం చేసుకుంటే పోలా?!" చెల్లెలు ఆటపట్టిస్తుంటే... ఎదురుదాడి చెయ్యాలనుకొనేవాడు. కానీ, ఎంత మగాడైనా సిగ్గు మొగ్గ వేసేది నిఖిల్‌లో.

అతని దృష్టి నాలుగో నంబరు సీటు వైపు మరలింది...

పచ్చగా ఉన్న ఆమె బుగ్గలు సంధ్యాకాంతుల్ని కుమ్మరించాయి.

అతని గుండె అదిరింది... మనసులో చిన్నపాటి అలజడి చెలరేగింది...

ఆ అమ్మాయి చెవులకి ఇయర్ ఫోన్స్ పెట్టుకొని పాటలు వింటోంది. ఎదురుగా నిలువెత్తు అందాలు విస్తుబోయేలా చేస్తున్నాయి.

ఇందాక సరిగ్గా చూడలేదు... ఇప్పుడు తేరిపార చూశాడు.

మిఅపరంగు పంజాబీ డ్రెస్‌లో మిసమిసలాడిపోతూ ఉంది. పైన వెన్నెలరంగు ఛుడీదార్‌లో పూసే వెన్నెలలా అందాల్ని విరబూస్తోంది. చూపు మరల్చుకుందామనుకున్నా మరల్చలేని ఆరాటం నెలకొంది.

'తన ఊహలలో నిరంతరం విహరించే భవతి ఎట్లా ఉంటుందో..?! ఈమెలా ఉంటుందో- లేక, ఇంతకన్నా సౌందర్యరాశో..!!'

- కోరికలు వెలుగుచూడడం మొదలుపెట్టాయి... మనసు మారాం చేస్తోంది... చూపులు అందేంత దూరంలో ఉన్న చుక్క చక్కదనాన్ని సంతరించుకునేసరికి హృదయం వశం తప్పుతోంది.

పైన పెట్టిన బ్యాగ్‌లోని వాటర్‌బాటిల్ తీసుకునేందుకు లేచింది. నిండుగా పంజాబీ దుస్తులు ధరించిన బుట్టబొమ్మలా అనిపించింది. అతనిలో నెలకొన్న భావాలు ఒక్కసారి హుషారుతో నిండిపోయాయి. మాటలకు అతీతమైన పరవశంతో మనసు ఊయలలూగసాగింది.

ఆమెతోటి ఆ నిశ్శబ్ద ప్రపంచం అతని కుఱ్ఱమనసుకి ఎంతో హాయినిస్తోంది. ఇదంతా ఏమిటో?! ఒక్కసారిగా తనలో ఈ మార్పు ఏమిటో..?! తలపులు తుఫానులో పడి తడిసిపోతుంటే... ఎదురుగా ఉన్న ఆ అమ్మాయి రూపం నిఖిల్ కళ్ళలో స్థిరపడిపోయింది.

భవతి రూపం ఎలాంటిదో..?!

ఆడదాన్ని గురించి ఎన్నడూ ఆలోచించని తనలో అవంతి మాటలు అలజడి రేపాయి. దానికి తల్లి వత్తాసు పలికింది. ఫలితంగా... అజ్ఞాతనేస్తం నిఖిల్ మదిమందిరంలో స్కాన్ చేయబడిపోయింది.

ఎప్పుడూ చూడని ఆమె- ఒక్కసారి చూసిన ఈమె ముందు తీసికట్టేమో!

ఈ అమ్మాయి ఎత్తు బహుశా తన భుజాల వరకు ఉండివుండొచ్చు. ఆధునిక సాంప్రదాయానికి, లయబద్ధమైన దుస్తులకు ఆమె పచ్చని శరీరఛాయ మరింత తళుకును తీసుకువచ్చింది. ఒత్తుగా పెరిగిన జడలో ఒక లేతగులాబీని తురిమింది. నుదుటిపై సన్నని వంకీల ముంగురులు... సన్నని బ్రెష్‌తో చిత్రించినట్టుగా ఎంత అందంగా ఉన్నాయో!!

ఆమె అరవిరిసిన తామరపూవు లాంటి ముఖంలో కళ్ళు, ముక్కు, నోరు అన్నీ కొలిచిమరీ అమర్చినట్లు ఉన్నాయి. అసలు ఆ ముఖాన్ని చూస్తూ జీవితమంతా గడిపేయవచ్చన్న అభిప్రాయం కలుగుతోంది. ఆ లేతబుగ్గలపై అటూఇటూ రెండు తీయనిముద్దులు పెట్టుకోవాలనే కోరిక మొదలైంది.

చక్కగా ఆడతనపు సోయగాలన్నీ సమపాళ్ళలో రంగరించి రూపొందించినట్లు ఉన్న భవతి సుందర రూపం అతని కనురెప్పల్లో నిలిచి, హృదయం పదేపదే ఆమె వైపుకు లాక్కువెళుతున్నట్లుంది. భవతిని తానెప్పుడూ చూడలేదు. కానీ, అవంతి మాటలతో గుండెల్లో అతివ రూపాన్ని ఆవిష్కరించుకున్నాడు.

ఎదుటి సీట్లోని ఆమెవైపుకు తిరిగాడు...

పత్రిక చదువుతోంది... మెల్లగా పుస్తకంలోంచి దృష్టిని మరల్చి నిఖిల్ వైపు చూసింది.

ఆమెనే గమనిస్తున్న అతని కళ్ళు తప్పుకోవాలనుకున్నా- వల్లకాక అక్కడే నిలిచి ఆగిపోయాయి. కళ్ళు కళ్ళు కలుసుకున్నాయి.

ఆ ముఖంలో మెరుపు చూశాక- నిఖిల్‌కి జంకు తగ్గి, ఉత్సాహం పెరిగిందేమో అన్పించింది.

పలకరింపుగా ఒక్క కనిపించీ కనిపించని నవ్వు విసిరి ముఖం ప్రక్కకు తిప్పుకొంది.

ఆ నవ్వులోని నిషా నిఖిల్‌లో నవనవోన్మేషాలకు ఊపిరిలూదినట్లనిపించింది- 'భవతి కన్నా అందంగా ఉంటుందా ఆ నవ్వు?' అని ప్రశ్నించింది.

ఉండకపోవచ్చు. ఆమె 'ఆల్ ఇన్ ఒన్' అని తిరిగి తనే సమాధానమిచ్చింది. నిఖిల్ చూపులు అస్తమాను ఆమెనే గమనిస్తున్నాయి.

ప్రక్కకు తొలిగిన ఛుడీదార్‌ని సరిచేసుకుంటూనో, చెదిరిన జుట్టును సవరించుకుంటూనో, చేతివాచీ టైమ్ చూసుకుంటూనో... ప్రతి భంగిమలోనూ ఒక్కో అందాన్ని ఆవిష్కరిస్తోంది.

'నన్ను ఏమనుకుంటోందో! ఒక జులాయిలా జమకట్టడం లేదు కదా! మేనర్స్ లేకుండా బిహేవ్ చేస్తున్నానని చీప్‌గా ఆలోచించడం లేదు కదా!! అయినా తన దృష్టిలో అపురూపమైన వస్తువు కాబట్టి ఆమె మనసులో ఏమనుకుంటూందో తెలియాలి...' భవతి మనసులో మెదిలింది. హృదయం రాగమయమై సంతోషం అంబరాన్ని అంటింది.

'సూళ్ళూరు పేట దగ్గర గూడ్స్ డిరైల్ అయిందట. అందుచేత ట్రైన్స్ సింగిల్‌ట్రాక్ మీద నడుపుతున్నారు. పినాకినికి క్లియరెన్స్ ఇవ్వాలంటే మరో గంట పట్టొచ్చు. అప్పటివరకు ఈ నెల్లూరు స్టేషన్‌లోనే!' బోగీలో ఉన్న పదిహేను మంది అనుకొని క్రిందకు దిగుతూంటే విండోనుండి బయటకు చూశాడు.

నెల్లూరు స్టేషన్‌లో రైలు ఆగి ఉంది. ఉదయం ఉన్న ఆహ్లాద వాతావరణంలో ఇప్పుడు మార్పు వచ్చింది. ఎండ ముందుకొచ్చి చలిని వెనక్కి నెట్టేసినట్లుంది. అందరిలాగానే తనూ వాటర్ తెచ్చుకుందామని క్రిందకు దిగాడు.

ఎదురుగా విండోలోంచి గ్లాసెస్ వెనుక అమ్మాయి ఆహ్లాదంగా కన్పిస్తోంది. మరోరకమైన అందాలతో అలరిస్తోంది.

'పెళ్ళి చేసుకోవాలి... కానీ, వచ్చే అమ్మాయి భవతిలా ఉండాలి!' చెల్లెలు అన్నమాటలు ప్రేరణ కలుగజేస్తూనే ఉన్నాయి. ఎవరో తెలియని 'భవతి' అనే అమ్మాయి మీద అనిర్వచనీయమైన ప్రేమానురాగాలు ఏర్పడసాగాయి. అప్పటినుండి ఏ అమ్మాయి కనిపించినా 'భవతి ముందు ఈమె దిగదుడుపే!' అన్న భావన నుండి అంతులేని ఆనందాన్ని కలుగజేస్తూంటుంది.

పర్సులోని తన టెలిఫోన్ బుక్ చూసుకున్నాడు. ఒకసారి అవంతిని మాటల్లో పెట్టి తెలుసుకున్న సెల్‌ఫోన్ నంబర్ కనిపించింది.

'ఒకసారి భవతికి ఫోన్ చేస్తే..? పలుకుతుందా? కనీసం ఆమె గొంతు ఎలావుంటుందో తెలుసుకోవచ్చు. 'హలో' చెప్పడంలో తప్పేముంది? నీ స్నేహితురాలి సోదరుణ్ణి- అని పరిచయం చేసుకుంటే మాట్లాడక ఏం చేస్తుంది?' -మనసు మాట్లాడమని మారాం చేయడంతో జేబులోని సెల్‌ఫోన్‌లో ఆ నంబరు దయల్ చేశాడు.

అవతలివైపు నుండి ఆ గొంతు తీయగా వినిపించింది...

కోయిల పాడినట్లుగా ఉంది ఆ స్వరం!

"గుడ్‌మార్నింగ్... ఐయామ్ నిఖిల్... అవంతి బ్రదర్ని!"

"ఓ... మీరా?"

"అంటే..?"

"అవంతి ఎప్పుడూ మీ గురించే చెబుతుంది..."

"ఏమని?"

"మీ హాండ్సమ్ పర్సనాలిటీ... జాబ్ ప్రొఫైల్... సక్సెస్ రేటింగ్ గురించి మాట్లాడుతూనే ఉంటుంది!"

"ఇంకా..?"

"అవునూ... మీరు ఆల్ ఇన్ వన్ అటగా!"

ఫక్కున నవ్వు వచ్చింది నిఖిల్‌కి.

"ఏమిటి నవ్వుతున్నారు?"

"మీ మాటలకి! ఒక్కసారి కూడా నన్ను చూడందే ఎలా కాంప్లిమెంట్ ఇవ్వగలుగుతున్నారు?"

"అవంతి నా డియరెస్ట్ ఫ్రెండ్... ఆటోమెటిక్‌గా దాని అన్న కూడా ప్రియనేస్తం అవుతారుగా!"

"ఎమ్మెస్సీ తరువాత ఆలోచన ఏమిటి?"

"ఎం.ఫిల్. చేద్దామనుకుంటున్నా..."

"ఆల్ ద బెస్ట్!"

"థాంక్యూ!"

"మీ మాటలు వింటుంటే మిమ్మల్ని చూడాలనిపిస్తోంది!"

"నాకూ అంతే!"

"అదేం మాట?"

"అవును! పెళ్ళంటూ చేసుకుంటే మా నిఖిల్‌లాంటి హాండ్సమ్ పర్సన్‌ను చేసుకోమని సలహా ఇస్తుంది అది!"

"దానికి మీ రియాక్షన్ ఏమిటి?"

"కొన్ని మాటలకు భాష ఉండదులెండి!"

"నా గురించి మీకేమిటి తెలుసు?"

"మీరు చెన్నై ఎయిర్‌టెల్ సెంట్రల్ ఆఫీసులో ఇంజనీర్... వెల్ సెటిల్డ్ బ్యాచిలర్!"

"మిమ్మల్ని ఒకటి కోరవచ్చా?"

"వై నాట్?"

"భవతీ... భిక్షాం దేహీ!"

"మీకూ తెలిసిపోయిందన్న మాట! ఈసారి అయిపోయింది అది..!" అంటూ అవతల నుండి పకపకా నవ్వుతోంది ఆమె. పగలే వెన్నెల కాచినట్లుంది ఆ నవ్వుతో.

ట్రైన్‌కి సిగ్నల్ ఇవ్వడంతో బాటిల్‌లో వాటర్ నింపుకొని బోగీ లోనికి ప్రవేశించాడు నిఖిల్. అంతరంగం అంతా తెలియని హాయితోనూ, మనసంతా భవతి ఊహలతోనూ నిండిపోయింది.

నవ్వుకుంటూ వస్తున్న అతన్ని వింతగా చూసింది ఆమె. ఆ ముఖంలోని సంతోషం ఏమిటో అర్థంకావడం లేదు. కుతూహలంగా పరికించసాగింది.

ఆమె కళ్ళలోకి చూశాడు... అవి మెరుపులా మెరుస్తున్నాయి!

ఆ మెరుపుల చల్లదనంలో చిక్కబడినట్లు ఆరాధనాభరితంగా అలాగే ఉండిపోయింది. తన్నుకువస్తూన్న నవ్వును పెదాల మాటున పట్టి ఆపడానికి ప్రయత్నిస్తోంది. కాని, ఆమెవల్ల కాకపోవడంతో తల ప్రక్కకు తిప్పేసుకుంది.

చల్లని గాలికెరటం ముంచెత్తిన అనుభూతి నెలకొంది నిఖిల్‌లో.

సంతోషం పట్టలేకపోతూన్న అతనికి భవతి ఒక అపురూపమైన వస్తువుగా అన్పించసాగింది. 'ఆమె ఎలా ఉంటుందో..?! ఈ అమ్మాయి కన్నా అందంగా ఉంటుందో, లేదో..?!' అవంతికి విషయాన్ని చెప్పాలని సెల్‌ఫోన్ యాక్టీవేట్ చేశాడు.

"ఏరాం... ఎక్కడున్నావ్?"

"ట్రాక్ ప్రాబ్లెమ్ వలన ట్రైన్ నెల్లూరులో ఉండిపోయింది. ఏమీతోచక మీ ఫ్రెండ్ భవతికి రింగ్ చేశాను."

"చేస్తావని తెలుసు!"

"ఎలా..?"

"దాని నంబర్ నోట్ చేసుకున్న వాడివి- ఫోన్ చేయకుండా ఉంటావని ఎలా అనుకుంటాను?"

"షి ఈజ్ ఎ నైస్ లేడీ!"

"యస్... నైస్ ఇన్ ఆల్ యాస్పెక్ట్స్!"

"ఆల్ ఇన్ ఒన్ అని నాకు కాంప్లిమెంట్ ఇచ్చింది!"

"మరి, నువ్వేమన్నావ్?"

"భవతీ... భిక్షాందేహీ' అన్నాను."

"ర్యాగింగ్ చేయడానికి- అది ఇప్పుడు చేయించుకునే స్థితిలో లేదు. చేసే స్టేజీలో ఉంది."

"నాకు చేయించుకోవాలనుంది!"

"ఇక్కడ ఆంధ్రా యూనివర్సిటీ ఎమ్మెస్సీ తరువాత మద్రాస్ యూనివర్సిటీలో యం.ఫిల్.కి అప్లయ్ చేసింది. అడ్మిషన్ వస్తే అక్కడ చేస్తుందిలే!"

"రియల్లీ..?!" నిఖిల్ మనసు ఉల్లాసంగా మెరిసింది.

కళ్ళ ఎదుట హాండ్సమ్‌గా ఉన్న యువకుడి విన్యాసాలు ఆనందాన్ని కలుగజేస్తున్నాయి ఆమెకు. పదేపదే అతన్ని గమనిస్తోంది. ముఖాన్ని అలముకున్న రాగభావంతో హాండ్‌బ్యాగ్‌లోని సెల్ తీసి డయల్ చేసింది.

"నిఖిల్ సార్‌ని చూశాను... నీ మాటలు, నా ఎక్స్‌పెక్టేషన్స్ సెంట్‌పర్సెంట్ మ్యాచ్ అయ్యాయి!"

"నువ్వేమిటి... చూడ్డం ఏమిటి?"

"అదే అందం... అదే హుందాతనం! మగతనానికి చిరునామా ఆయన!!"

"అర్థంకాని విషయంతో అయోమయంలో పడేస్తావేమిటీ?"

"అర్థమూ కాదు, అయోమయమూ కాదు. నాకు అన్నీ అర్థమయ్యాయ్. ఒకరికొకరు ఆల్ ఇన్ ఒన్ అయిపోయాం!"

ఆ అమ్మాయి మాటలు అయోమయంలో పడేశాయి నిఖిల్‌ని.

అతనికేసి చూసి పకపకా నవ్వుతోంది. ఆ నవ్వులో 'ఒకరి మనసు ఒకరికి తెలిసిందిలే...' అన్న భావన ద్యోతకమవుతోంది.

అర్థంకాని నిఖిల్ భవతి నంబర్‌కి రెండోసారి డయల్ చేశాడు.

ఊపిరి బందీ అయిన భావన- అతనితో రెండోసారి మాట్లాడాలంటే ఏదో బిడియం కలుగుతోంది. ఎదురుగా ఆమె చేతిలో సెల్‌ఫోన్ రింగ్ అవుతోంది. అతనిలో కన్‌ఫ్యూజన్ మటుమాయం అయినట్లనిపించింది. పొరలు పొరలుగా నవ్వుతెరలు తన్నుకొస్తున్నాయి.

"యూ... యూ..?!"

"యస్... ఐ యామ్ భవతి, యమ్.యస్సీ. ఫైనల్!"

"అవంతి నా సిస్టర్!"

"మీరు నిఖిల్... ఎయిర్‌టెల్ ఇంజనీర్!"

"మీరు... ఇక్కడ?"

"మద్రాసు యూనివర్సిటీలో ఎం.ఫిల్. కోసం పేపర్స్ సబ్‌మిట్ చేయడానికి వెళుతున్నాను!" అందమైన ఊహతో నేత్రాలు బరువుగా వాలిపోయాయి ఆమెకు.

"మీలాంటి అమ్మాయిని పెళ్ళి చేసుకోవాలని అవంతి పోరుపెడుతోంది!"

"నా విషయంలోనూ అదే జరిగింది!"

క్రమక్రమంగా వారి మాటలు, ఉద్దేశాలు దగ్గరవుతున్నాయి. వాటిలో అనురాగ పరిమళం తొణికిసలాడుతోంది.

విషయాన్ని గ్రహించిందేమో... స్పీడు అందుకొని పట్టాలపై పంచకళ్యాణి గుఱ్ఱంలా పరుగులు తీస్తోంది పినాకినీ ఎక్స్‌ప్రెస్.

'మరలా మీలాంటి ఏమిటి... మీరైతేనే రైటు!' అన్న మధురమైన భావనతో ముందుకు సాగిపోతున్నాయి వారి అంతరంగాలు.

'సృజనప్రియ' ఏడవ వార్షిక ప్రత్యేక సంచిక

తమ పుస్తకాలను పుస్తకరూపంలోకి తీసుకురావాలన్న ఆసక్తి, అభిలాష
ఉండికూడా ప్రచురణకి అయ్యే ఖర్చుని చూసి వెనుకంజ వేస్తున్న
వర్ధమాన, అనుభవజ్ఞులైన రచయితలకు ప్రచురణ వ్యయంలో వెసులుబాటును కల్పిస్తూ...

జయంతి పబ్లికేషన్స్

రూపొందించిన ప్రచురణ విధానాల గురించిన పూర్తి వివరాల కోసం
మా అడ్రసుకి వ్రాసి ఉచితంగా పొందండి.